ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 26.02.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ప్రభుత్వం ఈరోజు భారీగా బదిలీలు చేసింది. 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

2. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లను బలవంతంగా కూల్చివేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఈరోజు "మూసీ గోస - బీజేపీ భరోసా" పరామర్శ యాత్రను చేపట్టింది.

3. అకాల వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామి ఇచ్చారు.

4. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా అభివృద్ధి చెందితేనే తెలంగాణ ఆర్థిక వృద్ధి సాధ్యమని పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు.

----------------------------

**ఐఏఎస్ ల బదిలీలు**

తెలంగాణ ప్రభుత్వం ఈరోజు 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జ బదిలీ అయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు

నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఎన్.శ్రీధర్ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. పలువురు జిల్లా కలెక్టర్లు కూడా బదిలీ అయ్యారు. కరీంనగర్, హనుమకొండ, మహబూబాబాద్, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల సహా పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లు నియమితులయ్యారు.

**జీఎస్**

------------------------------

**బీజేపీ భరోసా యాత్ర**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్‌చందర్ రావు నేతృత్వంలో "మూసీ గోస - బీజేపీ భరోసా" పరామర్శ యాత్ర హైదరాబాద్‌లో కొనసాగుతోంది. బాపూఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి ప్రారంభమైన ఈ యాత్ర టిప్పు ఖాన్ బ్రిడ్జి, గంధంగూడ, మధు పార్క్ రిడ్జ్, విఘ్నేశ్వర కాలనీ, కేకే కాలనీ, గండిపేట తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో సాగింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లను బలవంతంగా కూల్చివేస్తోందని బీజేపీ ఆరోపించింది. బాధిత కుటుంబాలను పరామర్శించిన రామ్‌చందర్ రావు, ప్రభుత్వం వెంటనే కూల్చివేతలు నిలిపివేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. సరైన పునరావాసం చూపకుండా, అశాస్త్రీయంగా ఇళ్లను కూల్చివేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందనీ తెలిపారు . బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని చెప్పారు.

**పీటీసీ – హైదరాబాద్**

--------------------------------

**తుమ్మల**

అకాల వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అన్ని మార్కెట్ యార్డుల్లో పంట ఉత్పత్తులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్షాల పరిస్థితులపై అధికారులతో నిన్న టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెడ్ యార్డులకు భారీగా వస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను తడవనీయొద్దని, రైతులకు టార్పాలిన్లు ఉచితంగా ఇవ్వాలని అన్నారు.

డెస్క్

----------------------------

**వాకిటి శ్రీహరి**

పాడి పరిశ్రమ పరిపూర్ణంగా అభివృద్ధి చెందితేనే తెలంగాణ ఆర్థిక వృద్ధి సాధ్యమని పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. సచివాలయంలో 2026-27 బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ఎంత కేటాయించారనే కాకుండా ఎంత ఖర్చు చేశామనే దృష్టితో పనిచేయాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛమైన పాలు, నాణ్యమైన చికెన్, మటన్, చేపల ఉత్పత్తి ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి పునాది అని మంత్రి పేర్కొన్నారు.

డెస్క్

--------------------------------

**కిషన్ రెడ్డి**

సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్ పల్లి నెహ్రునగర్ లో పునర్నిర్మించిన పద్మశాలి కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పద్మశాలి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆయా సామాజికవర్గాలు కూడా పేదలను ఆదుకునేందుకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

**జీఎస్**

------------------------------

**అగ్నిప్రమాదం**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఒక దుస్తుల షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షోరూం ముందు ఏర్పాటు చేసిన టెంపుల్ సెట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో షోరూంలోని దుస్తులు కాలిపోయినట్టు తెలుస్తోంది. దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని ముంచెత్తడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందనీ అధికారులు చెబుతున్నారు.

**పీటీసీ - హైదరాబాద్**

--------------------------------

**విబీ జీ రామ్ జీ**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబీ జీ రామ్ జీ పథకంలో 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం ప్రతీ కూలికి లాభదాయకమని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన దినసరి కూలీ లోకోజు సతీష్ కుమార్ చెప్పారు.. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.....

**బైట్ - లోకోజు సతీష్ కుమార్**

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------------

**వ్యవసాయం**

ఆసిఫాబాద్ జిల్లాలో పీఎం కృషి సంచాయి యోజన ద్వారా పలు మండలాల్లోని రైతులకు యాంత్రికరణ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ మాట్లాడుతూ...

**బైట్ - వెంకటి**

పీటీసీ - ఆసిఫాబాద్

------------------------------------

**కలెక్టర్లు**

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అనురాగ్ జయంతిని ప్రభుత్వం నియమించింది. ఆయన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్‌గా ఇప్పటివరకు సేవలందించిన హనుమంతరావును దేవదాయ శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బదిలీ అయ్యారు. టీజీ ఎన్ పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గా ఆయనను నియమించారు. భద్రాద్రి జిల్లాకు నూతన కలెక్టర్ గా నిజామాబాద్ అదనపు కలెక్టర్ గా పని చేస్తున్న అంకిత్ ను బదిలీ చేశారు.

నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లును బదిలీ చేశారు.

పీటీసీలు - జిల్లాలు

------------------------------

**విశ్వ వీక్షణం**

వరంగల్ నగర వాసులకు విశ్వాన్ని వీక్షించే అరుదైన అవకాశాన్ని కల్పించారు కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ అధికారులు. విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్ పై భారీ టెలిస్కోప్ ను ఏర్పాటు చేశారు. ఆకాశంలో పగటివేళ సూర్యుడు, సాయంత్రం నక్షత్రాలు, జాబిలిని వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఇస్రో, కుడా సహకారంతో వీటిని ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు.

పీటీసీ - వరంగల్

------------------------------------

**మొబైల్ ఫోన్ల రికవరీ**

మొబైల్ ఫోన్ల రికవరీలో జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గీతే అన్నారు. సెల్ ఫోన్ రికవరీ మేళాలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 6లక్షల రూపాయల విలువైన 63 ఫోన్లను రికవరీ చేశామన్నారు. మొబైల్ ఫోన్ చోరీకి గురైతే వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

**పీటీసీ - సిరిసిల్ల**

--------------------------------

**కడియం**

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు అరుదైన గౌరవం దక్కింది. ఇండియా సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ సభ్యురాలిగా ఆమెను లోక్ సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేసింది. భారత్– సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే ఈ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ లక్ష్యంగా ఏర్పాటు చేశారు.

**పీటీసీ - వరంగల్**

--------------------------------

**భూదాన్**

హైకోర్టు ఆదేశానుసారమే వెలుగుమట్ల భూదాన్ భూములను ఆక్రమణదారుల నుంచి ఖాళీ చేయించామని, ప్రభుత్వానికి చెందిన 250 కోట్ల రూపాయల విలువైన భూమిని కాపాడామని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. ఈరోజు ఖమ్మం లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బాధితులు హైకోర్టులో వేసిన లంచ్ మోషన్ పిటిషన్ ను కూడా హైకోర్టు తిరస్కరించిందని చెప్పారు. అర్హులైన పేదలను ఆదుకొని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, నిజమైన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజా అవసరాలకు మాత్రమే భూదాన్ భూమిని వినియోగిస్తామని చెప్పారు.

**పీటీసీ - ఖమ్మం**